క్లుప్తంగా

అందరి సహకారంతో బేతాళ ఉత్సవం విజయవంతం


ఎస్సైని సన్మానిస్తున్న సంఘ నాయకులు

అంబాజీపేట: అందరి సహకారంతో శ్రీ విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవం విజయవంతంగా జరిగిందని అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి రామారావు, కార్యదర్శి మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్య అర్జున మోహనరావు తదితరులు తెలిపారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్య కుమార్ ఆధ్వర్యాన పటిష్ట బందోబస్తు నిర్వహించారన్నారు. పోలీసు శాఖ నుంచి సహాయ సహకారాలు అందించిన ఎస్సై చైతన్య కుమార్‌ను సంఘ నాయకులు అంబాజీపేటలో గురువారం ఘనంగా సత్కరించారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


మొక్కలు నాటుతున్న విద్యార్థులు, టీచర్ ప్రభావతి

సఖినేటిపల్లి: మొక్కలు పెంచి, పర్యావరణాన్ని కాపాడుకుందామని సఖినేటిపల్లిలంకకు చెందిన ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాజోలు క్లస్టర్ కో ఆర్డినేటర్, తెలుగు టీచర్ గుండేపల్లి ప్రభావతి అన్నారు. సఖినేటిపల్లిలంక శివారు సుంకరేవు ప్రాథమిక పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం నల్లి శామ్యూల్‌రాజు ఆధ్వర్యాన ప్రభావతి గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి బాదం, దానిమ్మ, బొప్పాయి, వేప, గోరింట, మందార మొక్కలు నాటారు. పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆక్సిజన్ ఇచ్చే మొక్కలను ఇళ్ల వద్ద కూడా పెంచుకోవాలని సూచించారు.

రైతులకు రుణాలు అందించేందుకు కార్యాచరణ


సమావేశంలో పాల్గొన్న రైతుసంఘం ప్రతినిధులు

మామిడికుదురు: నారియల్ భారత్ న్యూట్రా ప్రొడ్యూసర్ కంపెనీలో సభ్యులైన రైతులు ఒక్కొక్కరికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ రుణాలు అందించే దిశగా కార్యాచరణ చేపట్టామని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నయినాల వేణుగోపాల్ తెలిపారు. మామిడికుదురులో గురువారం జరిగిన రైతు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కంపెనీ ద్వారా రూ.17.50 కోట్ల కురిడీ కొబ్బరి వ్యాపారం చేస్తున్నామన్నారు. రైతులు సమిష్టిగా కంపెనీగా ఏర్పడటం వలన ఎన్నో ప్రయోజనాలున్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు సభ్యులుగా చేరాలని కోరారు.

గుమ్మిలేరులో నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

ఆలమూరు: గుమ్మిలేరులో శుక్రవారం ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుందని సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. నియోజకవర్గంలోనే అత్యధికంగా 29.75 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీలో సుమారు 1,391 మందికి ఇళ్ల పట్టాలు అందజేయనున్నామన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తారని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆలమూరు: చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలగనుంది. ఏపీ ఈపీడీసీఎల్ రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తామని అన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ


ఆలమూరులో కళ్లజోళ్లు అందుకున్న విద్యార్థులతో వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా కంటి సమస్యలు గుర్తించిన 154 మంది విద్యార్థులకు గురువారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వీటిని కంటి వైద్య నిపుణులు పి.శ్రీలక్ష్మి ఆధ్వర్యాన వివిధ గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వైద్య, ఆరోగ్య సిబ్బంది అందజేశారు. కంటి సమస్యల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

అర్హతే ప్రామాణికం

- సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ సంక్షేమం
- కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- అవిడిలో గడప గడపకూ మన ప్రభుత్వం


చొప్పెల్ల-2 గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని నిర్వ హిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: కులం, మతం, పార్టీ అనే భేదం చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అవిడి గ్రామంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి, 'అవ్వా పింఛను వస్తోందా? అమ్మా ఆసరా వచ్చిందా? చేయూత అందిందా? కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పడిందా? రైతుభరోసా క్రమం తప్పకుండా వస్తోందా? పిల్లలకు అమ్మ ఒడి పడుతోందా? వారు బాగా చదువుతున్నారా?' అంటూ ప్రతి ఇంటా అక్కచెల్లెమ్మలను, అవ్వాతాతలను, అన్నదమ్ములను ఆప్యాయంగా పలకరించారు. వారికి వర్తించిన పథకాలను వివరిస్తూ సంబంధిత బుక్‌లెట్లు అందజేశారు. నిరుపేద కుటుంబాల ఆర్థిక అవసరాలు తీర్చి, వారి జీవితాల్లో వెలుగు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని జగ్గిరెడ్డి అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని, అందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ఆయన ఆకాంక్ష అని చెప్పారు. ఈ సందర్భంగా కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, ఉప సర్పంచ్ పల్లి సౌమ్య దంపతుల ఆధ్వర్యాన జగ్గిరెడ్డితో పాటు నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, ఏఎంసీ చైర్మన్ రెడ్డి రవీదేవి, సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు నేతల వెంకటలక్ష్మి, దూళి సూరిబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నామాడి రాజారత్నం, వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కుర్రా శ్రీను, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యడ్ల నరేష్, మండల సేవాదళ్ అధ్యక్షుడు జీపీ, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, కార్యదర్శి ఎస్.రెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చొప్పెల్ల-2లో..

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల-2 గ్రామ సచివాలయ పరిధిలోని శ్రీరామ నగర్‌లో కూడా ఎమ్మెల్యే, విప్ చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కోవిడ్ సమయంలో ప్రజలకు కలిగిన మేలును, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది అందించిన సేవలను గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను వివరించారు. కాలనీ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. పేదల అభ్యున్నతికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు అహర్నిశలూ శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని గ్రామస్తులకు జగ్గిరెడ్డి విజ్ఞప్తి చేశారు. కాలనీలో రంగా విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అర్హులైన లబ్ధిదారులకు రికార్డు స్థాయిలో రూ.8.5 కోట్ల మేర లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, సర్పంచ్ దంగేటి చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, నల్లి రాజు, సర్పంచ్‌లు గుణ్ణం రాంబాబు, దూలం వెంకటలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ సుంకర కామరాజు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తదితరులు పాల్గొన్నారు.


అవిడిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

వ్యభిచార నిర్వాహకుల అరెస్టు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో వ్యభిచారం చేయిస్తున్న ఇద్దరిని ఆలమూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై ఎల్.శ్రీను కథనం ప్రకారం.. అక్రమంగా సొమ్ము సంపాదించాలనే దురుద్దేశంతో గ్రామానికి చెందిన భార్యాభర్తలు మహిళలను తీసుకువచ్చి, తమ ఇంట్లో గోప్యంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. దీనిపై కొత్తపేట డీఎస్పీ కేవీ రమణకు ఎస్పీ ఎస్.శ్రీధర్ సమాచారం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్, ఎస్సై శ్రీను నేతృత్వంలో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో వ్యభిచార గృహ నిర్వాహకులిద్దరితో పాటు ఒక విటుడిని అరెస్టు చేశారు. ఎస్సై శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈవ్ టీజింగ్, రౌడీయిజం, జూదంపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సత్వరమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానానికి చెందిన అగ్ని ప్రమాద బాధితుడు బొమ్మిడి నాగరాజు కుటుంబానికి ఆంధ్రా గల్ఫ్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ద్వారా గురువారం రూ.7 వేల ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఈ మొత్తాన్ని గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు సమకూర్చారు. దీనిని సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు పోతాబత్తుల భాస్కరరావులు ఆ కుటుంబానికి అందజేశారు.

పెద్దింటికి పురస్కారాలు


తాడేపల్లిగూడెంలో పెద్దింటి రామాన్ని సత్కరిస్తున్న ప్రముఖులు

కొత్తపేట: ప్రముఖ జ్యోతిష పండితుడు, సేవాతత్పరుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం).. పొట్టి శ్రీరాములు సేవా పురస్కారం, కళారత్న పురస్కారం అందుకున్నారు. తాడేపల్లిగూడేనికి చెందిన సిరిమువ్వ సోషల్ సర్వీస్ అండ్ ఆర్ట్స్ అసోసియేషన్ (పొట్టి శ్రీరాములు స్మారక సేవా సంస్థ) బుధవారం రాత్రి సిరిమువ్వ షడ్వింశతి వార్షికోత్సవం, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారిని సత్కరించారు. వీరిలో కొత్తపేటకు చెందిన పెద్దింటి రా మం ఒకరు. వివిధ సేవా కార్యక్రమాలు, వినూత్న ప్రయోగాలు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు సేకరణ, పెంపకం వంటి వివిధ కార్యక్రమాలతో 82 ప్రపంచ రికార్డులు సాధించినందుకు గాను గుర్తింపుగా ఈ పురస్కారాలకు రామాన్ని ఎంపిక చేశారు. ఆ సంస్థ ప్రతినిధులు గ్రంధి సుబ్బారావు, సిరిమువ్వ శ్రీనివాస్, ప్రముఖులు కొండా నరసింహారావు, గోపిశెట్టి మనోహర్, మద్రి సత్యనారాయణ, శ్రీకాకోళ్లపు కాళీకృష్ణ తదితరుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాలు అందుకున్నారు.

వైభవంగా 18 కలశాల పూజ


అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న స్వాములు

మామిడికుదురు: అప్పనపల్లిలో అయ్యప్పస్వామి 18 కలశాల పూజ బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. గొడవర్తి రాజా నివాసం వద్ద జరిగిన ఈ పూజలో అధిక సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు. మేళతాళాలు, బాణసంచా కాల్పులతో స్వాములు నృత్యాలు చేస్తూ కలశాలతో వైనతేయ గోదావరి నదికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడి నుంచి కలశాలతో గోదావరి జలాలు తీసుకు వచ్చి పూజ నిర్వహించారు. పెదపటన్నం గ్రామానికి చెందిన జయంతి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యాన వినాయకునికి, సుబ్రహ్మణ్య స్వామికి, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, సహస్రనామార్చన చేశారు. మానేపల్లికి చెందిన కాలిశెట్టి ప్రకాశ్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప భక్తి గీతాలాపన కార్యక్రమం భక్తుల్ని ఆనందపరవశులను చేసింది.

దోమల నివారణ మందు పిచికారీ

రాజోలు: జ్వరాల విజృంభణకు కారణమవుతున్న దోమల నివారణకు గ్రామాల్లో ఎబెట్ మందు పిచికారీ చేయిస్తున్నామని తాటిపాక పీహెచ్‌సీ డీపీ ఎంఓ సత్యనారాయణ తెలిపారు. మురుగు నీటి ప్రాంతాలు, డ్రైనేజీల్లో దోమల లార్వాను నాశనం చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై పొదలాడ కంచి కామక్షమ్మ కాలనీ వాసులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. ముంపునీరు, మురుగు నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మురుగు నీటిలో పాత క్రూడ్ ఆయిల్ వేయడం ద్వారా దోమల గుడ్లు, లార్వాలు చనిపోతాయన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎం.కృష్ణ, ఏఎన్ఎం సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష చారిత్రాత్మకం


వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన, జెడ్పీటీసీ రమాదేవి

కొత్తపేట: జగనన్న ఆరోగ్య సురక్ష చారిత్రాత్మక కార్యక్రమమని అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశంలోనే కనీవినీ ఎరుగని రీతిలో ఈ కార్యక్రమం నిర్వహించిందని చెప్పారు. కొత్తపేట గ్రామ సచివాలయం-4 పరిధికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో డేవిడ్‌రాజుతో పాటు ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్యులతో పాటు పలువురు స్పెషలిస్టులు, వైద్య సిబ్బంది, వివిధ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

వైద్యులకు ఘన సన్మానం

మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ముగిశాయి. సెప్టెంబర్ 30 నుంచి ఈ నెల 2 వరకూ 10 గ్రామాల్లోని 18 సచివాలయాల పరిధిలో ఈ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో వైద్య సేవలందించిన వానపల్లి, అవిడి పీహెచ్‌సీల వైద్యులు, వివిధ విభాగాల స్పెషలిస్టులు డాక్టర్ కేఎస్ఎస్‌బీ హర్ష, డాక్టర్ కె.ఇంద్రావతి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ వినీష, డాక్టర్ పి.శ్రీనివాస్, డి.అక్కలను ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, కొత్తపేట పంచాయితీ కార్యదర్శి వీవీ రామన్ ఆధ్వర్యాన అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీపీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ బడేమియా, సేవాదళ్ మండల అధ్యక్షుడు జీపీ, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి మట్టపర్తి సూర్యచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలి

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- జి.పెదపూడిలో ప్రభుత్వ భవనాలు ప్రారంభం


జి.పెదపూడిలో ఆర్‌బీకే భవనాన్ని విద్యార్థులతో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరారు. జి.పెదపూడిలో రూ.69 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. రైతుభరోసా కేంద్రానికి (ఆర్‌బీకే) విద్యార్థులతో ప్రారంభోత్సవం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంగేటి అన్నవరం అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ, సీఎం జగన్ ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకువచ్చారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా నాయకుడు మంతెన రవిరాజు, సర్పంచ్‌లు తోలేటి బంగారు నాయుడు, కొంబత్తుల ఏసుబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, పీఆర్ జేఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర దేశాలకు సీఎం జగన్ ఆదర్శం

అంబాజీపేట: పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలిసారిగా క్రైస్తవ మైనార్టీ సెల్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇతర దేశాలకు సైతం ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.బాబూరావు అధ్యక్షతన అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనం అంబాజీపేట మార్కెట్ యార్డులో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ క్రైస్తవులు ఆర్థిక పురోభివృద్ధి చెందాలని అన్నారు. నాలుగు మండలాల్లో క్రిస్టియన్ మైనార్టీలకు కమ్యూనిటీ భవనాలు, శ్మశానవాటికల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ డాక్టర్ మేడిద జాన్సన్, కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ, ఇప్పటి వరకూ 4 వేల మంది పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనం అందిస్తోందని చెప్పారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలంటూ పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


అంబాజీపేటలో పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఘనంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



చెముదులంకలో ర్యాలీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు, విద్యార్థులు

ఆలమూరు: చెముదులంకలో గురువారం విజిలెన్స్ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. రాజమహేంద్రవరం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధ్వర్యాన స్థానిక శ్రీ తిర్నాతి సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూలులో అవినీతి వద్దని చెబుదాం - జాతికి అంకితమవుదాం అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి.శివరామ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విజిలెన్స్ ఎస్పీ ముత్యాల నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే అవినీతికి వ్యతిరేకంగా పోరాడి ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. విద్యార్థులంతా సామాజిక బాధ్యతతో మెలిగి తల్లిదండ్రులు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. అనంతరం విజిలెన్స్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేశ్ పాల్గొన్నారు.

కొత్త ఓట్ల నమోదుకు స్పెషల్ క్యాంపైన్

కొత్తపేట: కొత్త ఓట్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులకు ఈ నెల 4, 5, వచ్చే నెల 2, 3 తేదీల్లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపైన్ నిర్వహిస్తున్నారు. ఆర్డీఓ ఎం.ముక్కంటి తెలిపారు. గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆ తేదీల్లో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓ) ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఉండి, కొత్త ఓట్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం-6, 7, 8 స్వీకరించాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి బీఎల్ఓలకు వచ్చిన దరఖాస్తులపై సమాచారం సేకరించి, సాయంత్రం 5 గంటలకు సంబంధిత తహసీల్దార్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. స్పెషల్ క్యాంపైన్ విధులకు గైర్హాజరయితే బీఎల్ఓలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హెచ్చరించారు. స్పెషల్ క్యాంపైన్‌ను ఏఈఆర్ఓలు పర్యవేక్షించి, బీఎల్ఓలు విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరైనా బీఎల్ఓలు గైర్హాజరైతే తనకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు.

ఐరన్ డ్రాప్స్ పంపిణీ

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యాన వైద్య, ఆరోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ అందజేశారు. రక్తహీనత నివారణకు ప్రతి గురువారం ఈ డ్రాప్స్ అందిస్తామని వైద్యాధికారులు తెలిపారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తువ్వ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

రాజోలు: నిబంధనలకు విరుద్ధంగా తువ్వ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ సీఐ శ్రీధర్ గురువారం తెలిపారు. మండలంలోని వేగివారిపాలెంలో ఎస్ఈబీ అధికారులు అక్రమంగా తరలిస్తున్న 4 టన్నుల ఇసుకను, ట్రాక్టర్‌ను సీజ్ చేసి రాజోలు పోలీసులకు అప్పగించారు. తువ్వ ఇసుక తరలిస్తున్న మలికిపురం మండలం గూడపల్లికి చెందిన పుచ్చకాయల నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.

ఎమ్మెల్సీ 'తోట'పై దుష్ప్రచారం చేస్తే సహించం

మండపేట: ఆపదలో ఉన్న అభాగ్యులకు అండగా నిలిచే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు అన్నారు. ఇటీవల పట్టణంలో చోటు చేసుకున్న ఎంపీఎస్ స్కూల్ వివాదంపై విపక్ష నేతల ఆరోపణలను గురువారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద మీడియా సమావేశంలో పాపారాయుడు తిప్పికొట్టారు. స్కూల్‌లో 50 శాతం వాటా కలిగిన తనకు అన్యాయం చేస్తున్నారని రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన తండ్రితో కలిసి బాధితురాలు ఎమ్మెల్సీ తోటను ఆశ్రయించారన్నారు. ఆమె దీనస్థితిని చూసి ఆమె సొంత సామాజికవర్గానికి చెందిన ప్రముఖులతో సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారన్నారు. వివాదంతో స్కూల్ మూత పడగా 1,400 మంది విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పాఠశాలను తెరిపించేందుకు ఎమ్మెల్సీ తోట చేసిన కృషిని పాపారాయుడు గుర్తు చేశారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి విపక్ష నేతలకు వెన్నులో వణుకు పుడుతోందన్నారు. స్కూల్ వివాదాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలన్న వారి ఆటలను ఎమ్మెల్సీ తోట సాగనివ్వలేదని పాపారాయుడు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సర్పంచుల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ మాట్లాడుతూ, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేగుళ్ల జోగేశ్వరరావు నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్సీ తోట నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండడంతో పాటు ఎన్నో దీర్ఘకాలిక సమస్యలకు చెక్ పెడుతున్నారన్నారు. గ్రామాల్లో ఆయనకు లభిస్తున్న జనాదరణతో తమకు మనుగడ కష్టమన్న భావనలో విపక్ష నేతలు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామకృష్ణ, కె.రాంబాబు, శెట్టి నాగేశ్వరరావు, పి.సత్తిబాబు, ఎస్.ధనరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పాపారాయుడు